ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (ఖండవల్లిలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 10-3-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుని పూజ చేయటం వలన మన మనస్సు భగవంతుని చుట్టూ తిరుగుతూ ఉంటుంది. దీనివలన మన మనస్సు బాగుపడటానికి అవకాశము ఉంటుంది. అహంకారమును ఆధారముగా పెట్టుకొని జీవించే జీవితాలు అన్నీకూడ కేవలము కృత్రిమజీవితాలు. అహంవృత్తిలో నుండి విడుదల పొందినవాడికి అది కృత్రిమజీవితం అని తెలుస్తుంది. అంతవరకూ అదే నిజము కృత్రిమజీవితము కాదు అనిపిస్తుంది.

కొంతమందికి తెలివి ఉండవచ్చు, ధనం ఉండవచ్చు, అధికారం ఉండవచ్చు. నాకు తెలివి ఉంది అనుకొంటారు. ఆ తెలివి ఎవరిది అంటే నాది అంటారు. ఆ తెలివి ఏ నేను అయితే కలిగి ఉందో ఆనేను అసత్యం. ఆ నేను ఎంత అసత్యమో నీవు కలిగి ఉన్న తెలివికూడా అంతే అసత్యము. నీ తెలివి దేని చుట్టూ తిరుగుతోంది. ఈ తెలివిని ఏ నేను అయితే కలిగిఉందో ఆ నేను చుట్టూ తిరుగుతోంది. ఆ నేను నశిస్తేగాని నీకు జ్ఞానం కలుగదు. ఆ నేనుకు తెలివి అలంకారముగా ఉంది, ధనం అలంకారముగా ఉంది. ఇవి అన్నీ ఏ నేను అయితే కలిగి ఉందో ఆ నేను నశిస్తేనేగాని నీకు మోక్షం కలుగదు. విషయ చింతన వదిలేస్తే మహాత్ముడు అవుతావు. విషయ చింతన వదలకపోతే ప్రకృతి నిన్ను విడిచిపెట్టదు. కొంతమంది మహాత్ములు సమాధిలో ఉంటారు. కాని భగవాన్ అలా కూర్చోకుండా మనలాగే తిరుగుతున్నారు ఏమిటి అని అడిగారు. దాని అర్థం ఏమిటి అంటే అంతర్‌సమాధిలో ఉన్నప్పుడు దేహదృష్టి ఉన్నప్పటికీ సమాధిలోనే ఉంటాడు. దానిని సహజసమాధి అంటారు. అప్పుడు దేహం, లోకం తెలుస్తూ ఉంటాయి. సమాధిలో ఉన్న జ్ఞానంలో కొరత ఉండదు. బ్రహ్మం ఎప్పుడు తెలుస్తుంది అంటే సమాధిస్థితిలో తెలుస్తుంది. దేహస్మృతి ఉందా, లేదా అన్నది ముఖ్యంకాదు. నీవు సమాధిస్థితిలో ఉన్నావా, లేవా అన్నది ముఖ్యం. దేహాన్ని మర్చిపోయి ఉండటం జ్ఞానం కాదు. సమాధి స్థితి పొందినవాడికి అంతా తానై ఉన్నాను అని వాడికి తెలుస్తుంది. విషయ చింతన వాడికి ఉండదు. విషయ చింతన లేకుండా ఉండటం కాదు అసలు విషయమే ఉండదు.

ప్రతీ జన్మలోనూ ఇలా సాధన చేయవలసిందేనా, కష్టపడవలసిందేనా, మాకు గమ్యం దొరకదా అని మీరు ఏమీ కంగారు పడనక్కరలేదు. మీకు తప్పని సరిగా గమ్యం దొరుకుతుంది. కొంత కష్టపడితే మన ప్రయత్నం సక్రమంగా ఉంటే మనమనస్సును భగవంతుడే సంస్కరింపచేస్తాడు. సంస్కరింపబడిన మనస్సు అంతర్ముఖమవుతుంది. మనస్సు కొంత అంతర్ముఖం అయిన తరువాత నీలోపల ఉన్న పరమేశ్వరుడు ఈ మనస్సును లోపలకు గుంజుకొని తనవశం చేసుకొంటాడు. అప్పుడు సాధన చేయటానికి నీకు ఎవడూ మిగలడు. సాధన చేసేవాడు పరమేశ్వరునికి స్వాధీనం అయిపోతాడు.

శరీరాన్ని, ఇంద్రియాలను, లోకాన్ని మనస్సే కల్పిస్తోంది. ఈ గారడీ అంతా మనస్సులో ఉంది. నీకు సమాధి స్థితి వచ్చినపుడు మనస్సు నశిస్తుంది. సమాధిస్థితిని ప్రాక్టీసు చెయ్యాలి. యజ్ఞాలు, నిష్కామకర్మ, సత్పురుషుల సహవాసము ఇవి అన్నీ మనస్సుకు శిక్షణ ఇవ్వటానికే. మన ఇంద్రియాలకంటే, శరీరం కంటే శాంతి మనకు దగ్గరగా ఉంది. కాని అందరము శాంతి లేదు అంటున్నాము. మనలో ఉన్న దోషములు శాంతిని

మనకు అందనివ్వటంలేదు. నేను ఉన్నాను అని నాపట్ల సజీవమైన విశ్వాసము నీకు ఉంటే నాకు సంబంధించిన శాంతి నీ హృదయంలో ఉంది కాబట్టి అది నీకు అందకుండా చేసేది నీ వాసన కాబట్టి ఆ వాసనను బయటకులాగి, ఎండగట్టి దహనం చేసి నీ హృదయంలో ఉన్న శాంతి నీ చేతికి అందేలా చేస్తాను అని కృష్ణుడు చెప్పాడు. బ్రహ్మానుభవం పొందినవాడికి చూడటానికి, ఆనందించటానికి ఏమీ ఉండదు. నీవు బ్రహ్మానుభవమును ఎప్పుడైతే పొందావో తెలుసుకోవటానికి కూడా ఏమీ మిగలదు. ఆ వస్తువే నీవు అవుతావు.

నేను శాంతిని అనుభవిస్తున్నాను అన్నప్పుడు అందులోనేను ఉంది. ఆ నేను వేరుతో సహా నశిస్తే నేను శాంతిని అనుభవిస్తున్నాను అని నీవు అనుకోవు. శాంతే నీవు అవుతావు. అది చివరిస్థితి. నేను, నేను అంటున్నావు ఆ నేనే నరకాసురుడు. నరకాసురుడు నీలోపలే ఉన్నాడు. నేను రూపములో ఉన్నాడు. వాడిని నీ తెలివితేటలతో చంపలేవు. దైవసహాయంతో ఆనేను రూపములో ఉన్న నరకాసురుడిని చంపాలి. వాడు నశించటమే నిజమైన దీపావళి. ఎప్పటికైనా ఈ నేను ప్రమాదమే. ఈ నేను ఉన్నంతకాలము అశాంతి తీసుకొని వస్తుంది. వంటఇంటిలో ఉండి మసి అంటించుకోకుండా ఉండటం ఎంత కష్టమో ఈ నేనులో ఉండి శాంతిని అనుభవించటం అంతే కష్టం. ఎందుచేతనంటే ఈ నేను ఎక్కడ ఉంటే అక్కడ అశాంతి ఉంటుంది.

నా మనస్సును భగవంతునికి ఇచ్చేసాను. ఆయన నాకు శాంతిని ఇవ్వటం లేదు, అనుగ్రహాన్ని ఇవ్వటంలేదు అని ఒక భక్తుడు భగవాన్‌తో చెపుతున్నాడు. భగవంతుడు నాకు సహాయం చేయటంలేదు అని ఎవరు చెపుతున్నారు. నీ మనస్సు చెపుతోంది. నీ మనస్సు నిజంగా దేవునికి ఇచ్చివేస్తే ఈ Complaint రాదు అన్నారు. నువ్వు మనస్సును మినహాయించుకొంటున్నావు. మినహాయింపులు లేకుండా నీ మనస్సును నాకు ఇస్తే నా యందే నీవు నివశిస్తావు. నా యందు నివశించటానికి నీ మనస్సే అడ్డువస్తోంది. నీ మనస్సును నాకు ఇచ్చివేస్తే నేనే స్వరూపముగా నీకు వ్యక్తమవుతాను. అప్పుడు నాయందే నివశిస్తావు అంటే ఆత్మయంధే నీవు ఉంటావు.

భగవాన్, కొందరు భక్తులు కలిసి శిఖరానికి వెళ్ళారు. వంట చేసుకోవటానికి కుండ, బియ్యం, కూరలు అన్నీ పట్టుకొని వెళ్ళారు. అగ్గిపెట్టె తీసుకొని వెళ్ళటం మర్చిపోయారు. అన్నీ ఉన్నాయి కాని నిప్పులేదు అందువలన వంట ఆగిపోయింది. అలాగే ఎన్ని ఉన్నప్పటికీ జ్ఞానం లేకపోతే మనకు మోక్షం లేదు అన్నారు భగవాన్. నువ్వు శాంతిలో ఉన్నావు, ఆనందములో ఉన్నావు, సహజస్థితిలో ఉన్నావు. కాని అది నీకు తెలియటంలేదు. అది నీకు దృఢపడలేదు. ఈ దేహమును నేను, మనస్సును నేను అని ఎంత గట్టిగా దృఢపడిందో అలాగ మీ లోపల ఉన్న సహజస్థితి నేను అని అంత గట్టిగా దృఢ పడితే నీకు సమాధి స్థితి కలుగుతుంది.

మీకు ఏదైనా కోరిక ఉంటే ఆ కోరిక తీర్చటానికి భగవంతుడు చూస్తాడు. భగవంతుని పొరపాటు ఏమీలేదు. ఆ కోరికకు సంబంధించిన జీన్స్ ఏ తల్లి తండ్రులలో ఉన్నాయో చూసి అక్కడ జన్మ ఇస్తాడు. మీ కోరిక నెరవేరటానికి అనుగుణమైన శరీరము, కుటుంబము, ఇంద్రియాలు, ప్రపంచము ఇస్తాడు. నీకు ఏమీ కోరిక లేదు అనుకో ఆయన స్వరూపమును ఇస్తాడు. ఇందులో భగవంతుని తప్పు ఏమి ఉంది చెప్పండి. గాలి లేనిచోట దీపం ఎంత నిర్మలంగా ఉంటుందో, ఎంత నిశ్చలంగా ఉంటుందో, ఎంత ప్రకాశవంతముగా ఉంటుందో అలాగ లోపల ఉన్న సహజస్థితిని నేను అనే భావన అంత నిశ్చలంగా నీకు కలగాలి. లోపల ఉన్న సహజస్థితిని నేనే, ఆ సమాధిస్థితి ఎవరో కాదు నేనే, ఆ జనన మరణములు లేని స్థితి ఎవరోకాదు నేనే అనే భావన సహజంగా నీకు దృఢపడాలి. తెచ్చిపెట్టుకొన్నట్లుకాదు. తెచ్చి పెట్టుకొన్నది,

అంటించినది ఎంతసేపు ఉంటుంది. సహజముగా నీకు ఆ భావన కలిగితే నీకు పునర్జన్మ రాదు. అప్పుడు ప్రకృతి నీకు దారి ఇస్తుంది. ఎవడైతే నిరంతరము భగవంతుని స్మరిస్తున్నాడో వాడికి ప్రకృతి దారి ఇస్తుంది. ఎందుచేతనంటే భగవంతుని చేతిలో ప్రకృతి ఉంది.

ఎంతవరకు జపంచేయాలి, ధ్యానం చేయాలి. ఈ సాధనలకు ముగింపు లేదా అని అడుగుతున్నారు. దేహము నేను అనే భావన ఇప్పుడు నీకు దృఢపడి ఉంది. అది ఉన్నంతసేపు జపం, ధ్యానం చేయవలసిందే. ఈ జపానికి ముగింపు ఉంది. ధ్యానానికి ముగింపు ఉంది. నీ హృదయంలో మరణంలేని వస్తువు ఒకటి ఉంది. అది నేనే అనే భావన నీకు దృఢపడే వరకూ నీవు జపం చేయవలసిందే, ధ్యానం చేయవలసిందే, విచారణ చేయవలసిందే, భగవంతునికి అణిగి ఉండవలసిందే ఇందులో రాజీ పడటానికి అవకాశము లేదు. నీ హృదయంలో ఉన్న వస్తువు గురించి నీకు తెలిసినపుడు ఈ సాధనలతో పనిలేదు.

నీవు జపం చెయ్యి. జపం అనేది ఎందుకో తెలుసుండి చెయ్యి. అప్పుడు జప ప్రయోజనము నెరవేరుతుంది. మీరు ఏదేవుని నామాన్ని జపం చేస్తున్నారో ఆ నామం మీద మీ మనస్సు ఉండాలి. ఆ నామం తప్పించి ఇతర తలంపులు ఏమీ నీకు రాకూడదు. ఇతర తలంపులు వస్తూ ఉంటే అది జపంకాదు. తలంపులు ఏమీ చేస్తాయి అంటే జపం చేసే వాడివంక చూస్తూ ఉంటాయి. జపం చేస్తున్నాడు అనుకోండి అవి ప్రక్కకు తప్పుకొంటాయి. జపం ఆపుచేసినపుడు అవి వచ్చి పట్టుకొంటాయి. జపం చేయగా చేయగా అది ధ్యానానికి దారి తీస్తుంది. ధ్యానం చేయగా చేయగా అది నీహృదయంలో ఉన్న చావులేని వస్తువును నీకు పట్టి ఇస్తుంది. చావులేని వస్తువు ఎవరో అనుకొంటున్నాను నేనే అనే అనుభవము నీకు ధ్యానం పట్టి ఇచ్చి అది ప్రక్కకు తప్పుకొంటుంది. అప్పుడు ధ్యానం చేసేవాడు మిగలడు. ధ్యానం మనస్సుచేస్తుంది. ధ్యానం మనస్సు చేతే చేసి ఆ చేసేవాడిని చంపుతాము.

హృదయంలోనికి వెళ్ళటానికి జీవుడు చూస్తాడు. వాసన ఏమిచేస్తుంది అంటే ఏ ఇంద్రియానికి బలహీనత ఉందో చూసుకొని అది పట్టుకొంటుంది. ఆ బలహీనతలు జీవుడిని ఆత్మవైపుకు వెళ్ళకుండా బాహ్యముఖానికి తీసుకొనివస్తాయి. ఇంద్రియ విషయాలు నీ మనస్సుకు హృదయం యొక్క లోతులలోనికి వెళ్ళకుండా తేల్చేస్తాయి. నీకు ఇంద్రియ నిగ్రహం ఎప్పుడైతే కలిగిందో మనస్సు అంతర్ముఖం అయ్యేటప్పుడు ఇంద్రియాలు మనస్సును వెనుకకు తీసుకొనిరావు. ఇంద్రియ నిగ్రహం లేకపోతే మనోనిగ్రహం రాదు. మనోనిగ్రహం లేకపోతే రిలాక్సేషన్ లేదు.

స్మశానంలో శరీరం కాలిపోయినపుడు ఇంద్రియాలు కాలిపోతాయి గాని నీ వాసనలు కాలవు. ఇంద్రియాలు లేకపోతే ఆ వాసన వ్యక్తమవ్వటానికి అవకాశములేదు. అప్పుడు ఆ వాసనకు కొత్త శరీరం వస్తుంది. దానికి కొత్త ఇంద్రియాలు వస్తాయి. ఆ ఇంద్రియాల ద్వారా ఆ వాసన వ్యక్తమవుతుంది. ఈ శరీరం ఉండగానే ఆ వాసన నశించింది అనుకోండి ఇంక పునర్జన్మరాదు. ఇందులో భగవంతుని పొరపాటు ఏమీలేదు.

క్రీస్తును శిలువ వేసేటప్పుడు మేకులతో కొడుతూ ఉంటే ఆ బాధలో ఓ తండ్రీ నన్ను మర్చిపోయావా, నేను ఏమి అపరాధం చేసాను, నన్ను మర్చిపోయావా అన్నాడు. ఓ తండ్రీ నన్ను మర్చిపోయావా అనటంలో కూడా నేను ఉంది. అప్పుడు వెంటనే ఈ ప్రశ్న వచ్చింది. ఓ తండ్రీ నన్ను మర్చిపోయావా అని అడుగుతున్నాను. ఈ complaint చేసే నేను ఎవడు? అనే ప్రశ్న వచ్చింది. ఆ ప్రశ్నరాగానే ఈ నేను అగాధంలో పడిపోయింది. అప్పుడు final state ను అందుకొన్నాడు. ఇది అంతా కొన్ని క్షణాలలో జరిగిపోయింది. ఎందుచేతనంటే లోపల prepare అయ్యి ఉన్నాడు. రెడీగా ఉన్నాడు. నన్ను మర్చి పోయావా అని దేవుని మీద complaint చేస్తున్నాడు. అంటే శరణాగతి పూర్తి అవ్వలేదు. నన్ను మర్చిపోయావా అని దేవుని అడిగే నేను పడిపోయిన వెంటనే శరణాగతి పరిపూర్ణమయింది. పూర్ణస్థితిని అక్కడ అందుకొన్నాడు.